# ఆమె చెప్పిన కథ

## కె. ఎ. స్వామి

సౌభాగ్యవతి శశికి —

శశీ! ఈ నా ఉత్తరాన్ని చూచి నీవేం ఆశ్చర్య పడనక్కర్లేదు. నీ పై నా కున్న మక్కువ ప్రభావం వల్లో — లేక నాపై నీవు చూపే చొరవ వల్లో నే నీ వాడు నాహృదయాంతరాల్లో ఘోషిస్తోన్న గాథను — కాదు బాధను నీ ముందు వుంచుతున్నాను సావధానంగా చదువు కాని మధ్యలోనే ఉత్తరాన్ని చదువడం ఆప కని నా ప్రార్థన.

నీకు తెలుసు మన చిన్ననాటి ముచ్చట్లూ మురిపేలూ. మన వివాహాలు గూడ ఏ ఏ పరిస్థితుల్లో జరిగాయో గూడ మనం మరువలేం!

చల్లగాలికి నదీతీరాల్లో మెత్తని ఇసుకలో వయ్యారంగా నడుస్తూ ఆకాశపు నీలినీ, పండబారిన సూర్యుని కనకాంబరపు సోయగాల్నీ విలోకిస్తూ నీ వేమనే దానవో తెల్సా — "చిట్టీ! చంద్రుణ్ణి చూస్తే కలువలకు ఉలుకు చకోరాలకు సంబరం కాని నిన్ను చూస్తే ప్రకృతి యావత్తూ పులకించిపోతుంది" అంటూ నన్నూ, నా అందాన్నీ తెగ పొగిడే దానవు. నిజంగా నాలో అణగారిన అందాన్నీ, అనుభూతుల్నీ రెచ్చగొట్టింది నీవే ఆ నీ పొగడ్తలు విన్నపుడెల్లా ఆనందోద్రేకాల్తో నా శరీరం గగుర్పొడిచేది నా అందాన్ని చూచుకొని నే నెంతో విరళురా ల్నయ్యేదాన్ని గూడ.

అందు కనుగుణంగా నీవు గూడ అంటూండే దానవు..."నీ కేం బంగారు బొమ్మవి దానికి తోడు డబ్బుందీ — చదువుంది నీ వో గజిటెడ్ ఆఫీసరుగారి భార్యవు కాకమానవు. అహో! నీ జీవితం ధన్యం."

దాపరిక మెందుకు శశీ! నీ వా మాట లన్నపుడెల్లా నే నో గజిటెడ్ ఆఫీసరు గారి భార్యలా, ఆ దిన మంతా రీవిగా, డాంబికంగా మసలేదాన్ని దాంతో ఎన్నో ఆవక తవక పనులు జరగడం, నాలుక్కొరుక్కోవడం ఎన్నోమార్లు జరుగుతుండేంది

ఒకసారు ఏమయిందో తెల్సా? మా పక్కింటి నీరజ మద్రాసునుండి తన యింటికి వచ్చిన ఫ్రెండ్సుని మా ఇంటికి తెచ్చింది—నాకు పరిచయం చేయడానికై.



ఆ దినం నిజంగా నే నెలాంటి అనుభూతుల్లో, భావపరంపరల్లో వున్నానో ఏమో — వాళ్ళ మాటలకంత నిర్లక్ష్యంగానూ, ముభావంగానూ సమాధానా లివ్వానట. అందుకే వాళ్ళు మేడమెట్లు దిగేప్పుడు నాకు వినబడేలా "ఏమిటావిడ

ఉద్దేశ్యం? గజిటెడ్ ఆఫీసర్లా ఆ గుం భనా, ఆ నిర్లక్ష్యమూను. అంతగర్వం దేనికమ్మా" అం దొకామె

"ఛఛ! అలాంటి దేంగాదు ఈ దినం దానికి వంట్లో నలతగుంది గాబోలు" అంటూ సమర్థించింది నీరజ దానికి నా ప్రాణం చివుక్కుమంది నన్ను నేనే నిందించుకున్నాను

చూడు శశీ! నాలో అందంతో బాటు అభివృద్ధి చెందిన యవ్వనం గూడ నన్నుక్కిరిబిక్కిరి చేస్తూ నా చుట్టూ వింత ప్రపంచాన్ని సృష్టించేది ఎన్నో ఆలోచనల్ని, ఆశల్ని రేపి ఊహలకు ఆకారాల్ని గూడ కల్పించి జోలపాట పాడేది దానికి అనుగుణంగా నీవూ తాళం వేసేదానవు—"నీ తీరే వేరు. నీ ఊహలే వేరు నీకు పెళ్ళైన తర్వాత నన్ను మాత్రం మరిచిపోకు."

అమ్మో నిన్ను మరువడమే శశీ! ఆ నీ మాటలు నా నరాలన్నిటినీ ఉత్తేజ పరిచేవి ఊహల్లో స్వర్గంలో విహ రించేదాన్ని ఆ నాటినుండి నా అందంలో, నా యవ్వనంలో, నా ప్రేమలో ఓ ప్రత్యేకత వుందనుకున్నాను, కాని శశీ! అదే నా మొదటి తప్పిదం అనుకుంటా

శశీ! నీకు తెల్సు నేను డాక్టర్ విశ్వంను ఎంతగా ప్రేమించింది అతని చూపుల్లో కమ్మదనం వొలికేది, పాటలో పరవశం పొర్లేది అతని వ్యక్తిత్వం నాకు బాగా నచ్చింది అందుకు నీవు గూడ నన్ను మెచ్చుకున్నావ్! "అతని కేం మన్మధునిలా వున్నాడు, గొప్ప భవి ష్యత్తు గలవాడు" అనిగూడ అన్నావు నాతో దాంతో అతని సాన్నిధ్యాన్ని మరింత అభిలషించాను అతని చూపుకై, అతని మాటకై గిజగిజ లాడాను, ఆ నాటి ఆ నా పరితపన ఈ నాడు తల్చు కుంటే నవ్వొస్తోంది శశీ!

"ఈ దినం కాలేజీకి సెలవుగా మళ్ళీ తయా రవుతున్నావు ఎక్కడికో" అం దొకనాడు మా అమ్మమ్మ నా ముస్తా బును చూచి

"లెక్చరర్ ఈ దినం 'అనాటమీ' లో స్పెషల్ క్లాసు పెట్టుకున్నాడు, వెళ్ళాలి అమ్మమ్మా!" అంటూ బైటకు పరు గెత్తాను తిన్నగా విశ్వం రూముకు వెళ్ళి అతనితో అలా 'షైరు' తిరిగివచ్చేదాన్ని అతనికోసం నే నెన్ని అబద్దా లాడానో, ఎన్ని ప్రయాసలు పడ్డానో అ దంతా వ్రాస్తే అవన్నీ ఓ పురాణం కాగలదు

శశీ! "ఉద్రేకంలో పొరపాట్లనేకం. జాగ్రత్తసుమీ!" అన్న ఆ నాటి నీ మాట లకు అప్పట్లో నే నంత ప్రాముఖ్యం ఇవ్వలేకపోయాను కాని ఈ నాడు అవే నాకు వేదవాక్కులై నాయ్,

నీకు బాగా జ్ఞాపకం నేనే అతణ్ణి ముందుగా అడిగాను — "నే నెలా గుంటాను" అని ఎలాగైనా నా అభి ప్రాయంతో బాటు అతని అభిప్రాయం గూడా తెల్సుకోవా లని నా అభిలాష.

అతడు ముద్దుగా నా వైపు చూస్తూ "బొద్దుగా అచ్చం అజంత సుందరిలా గుంటావు?" అన్నాడు. పెదాల పై దరహాస రేఖల్ని మెలిబెడ్తూ సిగ్గుతో ఎర్రబడ్డ అధరాల్ని ఒక్కమారు ఎడమ చేత్తో తడువుకొని క్రీగంట అతన్ని చూస్తూ "విశ్వం! నన్ను చూస్తే నీకేం అవుపించడంలేదూ?" అన్నాను మళ్ళీ. అలా అడిగినందుకు నాకు నిజంగా సిగ్గేసింది నా గుండె వేగంగా కొట్టుకో సాగింది

అతడు నదిలోని నీళ్ళను కాళ్ళతో చిలికిస్తూ నా వైపు అదోలా చూచి మెల్లగా నవ్వాడు నిజంగా ఆ నవ్వు మరువ రానిది శశీ! ఆ నవ్వులో వెన్నెలలు కురిశాయి ఆ నవ్వులో అమృతం చిందింది నాలోని కోర్కెలన్నీ ఒక్కమారుగా విజృంభించినాయ్!

"విశ్వం! నిన్ను ప్రేమిస్తున్నాను" అన్నాను ఇక ఉండబట్టలేక దానికతడేం అదిరిపడలేదు నిజానికి శశీ! ఆ నా మాటలకు మరొకరైతే అమాంతం ఆకాశమంత ఎత్తు ఎగిరిపడి ఆనందంతో ఉక్కిరి బిక్కిరై ఆనంద భైరవిలో ఓ ప్రేమగీతాన్ని ఆలాపించి ఉండేవారు కాని విశ్వం మాత్రం గారంగా నా కళ్ళ లోనికి చూస్తూ "నీ ప్రేమ నాకు తెలుసు చిట్టీ!" అన్నాడు.

"మరెందుకు నన్నిలా వేధించడం? సంకోచించకు నేను నీదాన్ని విశ్వం..." అన్నాను ఉద్రేకంతో, అతని కళ్ళలోకి చిలిపిగా చూస్తూ.

అప్పటికీ అతనిలో ఎలాంటి ఉద్రేకం కనబడలేదు మామూలుగానే నా వైపు తిరిగి "చిట్టీ! నీవు చాలా త్వరపడు తున్నావు!" అన్నాడు నిజంగా అది నాకేమంత త్వరపడ్డట్లు అవుపించలేదు. ఆ పరిస్థితుల్లో వున్న మరే స్త్రీ అయినా సరే నాలానే ప్రవర్తించివుండే దనడంలో సందేహంలేదు అందువల్ల అతని మాటలు నన్ను నిరుత్సాహం పర్చినయి. అయినా నాలో ఎలాంటి మార్పును కన బర్చక ఎప్పటిలా నవ్వుతూ "ఇందులో ఆలోచించవలసింది ఏముంది విశ్వం?" అన్నాను

అతడు నా ఎడమచెక్కిల్ని తన కుడి చూపుడువ్రేలితో నొక్కి "భవిష్యత్తును గూర్చి ఆలోచించాలి చిట్టీ! అదే మనకు ముఖ్యం" అన్నాడు నవ్వుతూ.

అతనిలోని భావాలేమిటో అప్పటి కేమీ నాకు అంతు చిక్కలేదు. వలచి వచ్చిన స్త్రీని అంత చులకనగా చూడ్డం నిజంగా మగవారికి క్షంతవ్యం గాని అపరాధంగా భావించాను ఆ విషయం అంతటితోనే ముగించడం మంచిదనుకొని సంభాషణ మరో విషయం మీదకు మార్చాను

ఆ రాత్రంతా నాకు నిద్ర పట్టలేదు అతని ఉద్దేశ్యం ఏమిటో ఎంత ఆలో చించినా తలకు వేడితప్ప మరేం ప్రయో

జనం లేకపోయింది. క్షణికోద్రేకాల్లో కేవలం శరీర వాంఛల్ని... వరాల ఉద్రేకాల్ని అణచుకోనేందుకు నే నలా అన్నా నని అత డనుకున్నాడేమో నని చాలా సేపు బాధ పడ్డానుగూడ చివరకు నే నొక నిర్ణయానికి వచ్చాను

శశీ! ఆ నా నిర్ణయాన్ని నీవుగూడ బలపరిచావు! "నీవు ఎంతైనా తెలివిగల దానవు! మీ ఇంటను చూచి లోకం ఈర్ష్యపడక మానదు" అన్నావు నా కళ్ళలోకి సూటిగా చూస్తూ.

ఆ తర్వాత నా నిర్ణయాన్నేమీ దాచుకోకుండా మా నాన్నగార్కి తెలియపర్చాను. విశ్వంను గురించి ఊరించి చెప్పానుగూడా. దానికి మా నాన్నగారు నవ్వారు. "అమ్మాయ్! నీ వంతగా చెప్పాలా? ఏనాడుమాత్రం నీ మాటను కాదన్నా నని? అతణ్ణి గూర్చి ఇంతకు ముందే విన్నానుగూడ. మంచి భవిష్యత్తు గలవాడు. నీ అందానికీ, ఆశయాలకూ తగ్గవాడు. నీ తల్లి జీవించి వుంటే ఎంత సంతోషించి వుండేదో?... నీకోరిక తప్పక నెరవేరుస్తానమ్మా..." అన్నాడు స్వర్గంలోని మాఅమ్మకు నాన్న జ్ఞాపకం వచ్చేసరికి మా నాన్నగారి కంఠం రుద్ధత పొందింది


ఆ క్షణంలోగూడ కళ్ళనిండా నీళ్ళు తిరిగినయ్, నిజంగా అమ్మేగనుక బ్రతికి వుంటే నన్ను చూచి ఎంత సంబరపడేదో? అమ్మకు లోలోపల్నే జోహారులర్పించాను సజల నేత్రాల్తో.

శశీ! విశ్వంతో పెళ్ళికి మా నాన్నగారు ఒప్పుకున్నందుకు నీవు గూడ నా చుబుకాన్ని నిమురుతూ "చిట్టీ! నిజంగా నీ జాతకం అపూర్వం నిన్ను చూస్తే అందరూ మంత్రముగ్ధుల్లా నిన్ననుసరిస్తారు. అదే నీలోని ప్రత్యేకత అలాంటిది అందరికీ లభ్య మౌతుందా?" అన్నావు అప్పుడు నిన్నావేశంతో ముద్దు పెట్టుకొన్నట్లుగూడ నాకు బాగా జ్ఞాపకం శశీ! నా అల్లరికి నీవు అప్పుడప్పుడు విసుక్కొనే దానవుగూడ అయినా నన్నెనాడూ నీవు విడిచియుండే దానవు గాదు నేను నా హృదయాన్ని నీ ముందు విప్పంది వుండేదాన్నిగాదు.

శశీ! నా నిర్ణయాన్ని విన్న విశ్వం నా జడ రిబ్బను మెలిబెడ్తూ "నీవు నిజంగా సాహసవంతురాలివి చిట్టీ" అన్నాడు అనురాగపూరితంగా.

"నా ఆరాధ్యదైవాన్ని నాలో ప్రతిష్ఠించుకోవడం ఒక సాహసంగాదు దాన్ని కలకాలం పూజించే యోగ్యతే నిజమైన సాహసం ఔతుంది" అన్నాను. అతని చొక్కా కాలర్ సరిచేస్తూ

దాని కతడు పేలగా నావైపు తిరిగి "అదిన్నీ నీ చేతులలోనే వుంది చిట్టీ" అన్నారు "అది నిజంసుమీ" అన్నట్టు అప్పుడే ఓ ప్యాసెంజెర్ ట్రైన్ తుంగ




భద్ర బ్రిడ్జిమీంచి హైదరాబాదువైపు వెళ్ళిపోయింది

శశీ! నిజాని కానాడు అతనిమాటల్లోని పరమార్థా న్నాలోచించవలసినంత అవసరం లేకపోయింది కాని ఈ నా డది నా జీవిత ధ్యేయాన్నే తలక్రిందు లొనర్చింది

నా సుఖమే తన సుఖంగా—అంతేగాదు తనకర్తవ్యంగాగూడ భావించే మా నాన్నగారు విశ్వం పెద్దల్తో సంప్రతించి విశ్వంతో నా వివాహం జరిపించేశారు.

మా పెళ్ళి మహా వైభవంగా జరిగిపోయిం దనీ, నిజంగా ఆలాంటి పెళ్ళిళ్లు మన దేశంలో బహు అరు దనీ నీవు ఆనాడు అన్నావు' అదేమోగాని శశీ! ఆనాటి నీ మాట లన్నీ వేదవాక్కులనుకో నిజంగా నాలాంటి పెళ్ళిళ్ళు బహుశః ఈలోకంలోనే అరు దని నేను ఘంటాపదంగా చెప్పగలను ఈనాడు

శశీ! ఇంతవరకు సవ్యంగా జరిగిపోయిం దంతా ఇక ఇక్కణ్ణుంచే అసలుకథ మొదలౌతుంది ఈ ఉత్తరం వ్రాయడానికి న న్నావేశపరచిన హృదయాంతరాల్లోని ప్రళయతాండవం బైటపడ్తుంది సావధానంగా చదువు

శశీ! అతణ్ణిగూర్చి నే పొందిన అనుభూతులూ, కన్న కలలూ, నిర్మించుకొన్న సౌధాలూ నిజంగా పేకమేడ లని నా కిప్పుడు తెలిసివచ్చింది అయినా అందు క్కారణం మ రెవ్వ రో గాదు

చేజేతుల నిర్మించుకొన్న నరకం ఇది శశీ! చేతులు కాలిన తర్వాత ఆకుల్ని పట్టుకోవడం అర్థరహితం అందుకే ఏవర్నీ నేను నిందించడంలేదు నీవుమాత్రం నా చెలివనీ, నా ఆప్తురాలివనీ ఎప్పటిలా నా హృదయంలోని తాపాన్నీ, పరితపననీ నీముందు వుంచుతున్నా

మా పెళ్ళినాటికి పరీక్షలు రెండే రెండు మాసా లుండడంవల్ల మా శోభనం వాయిదా పడ్డది అది నీకూ తెల్సు నిజానికి అతడికనావాడై పోయినందున అది నా కేమంత బాధ అనిపించలేదు అతని సాన్నిధ్యంలో, అతని చూపుల్లో, అతని పలుకరింపుల్లో, లాలింపు కవ్వింపుల్లో ఎంతో మురిసిపోయేదాన్ని

రెండునెలలూ రెండుక్షణాల్లా దొర్లిపోయినయ్ ఇద్దరం పరీక్షలు బాగా వ్రాశాము పరీక్షలు ముగియగానే అతడు మా అందరి వద్దా సెలవు తీసుకొని హైద్రాబాదు వెళ్ళిపోయాడు

నా హృదయం, నా నైజం మా అమ్మమ్మకు బాగా తెల్సు వెంటనే నాన్నగారితో మాట్లాడి శోభనానికి ముహూర్తం నిశ్చయం చేయించింది శశీ, స్త్రీ పురుషుల సహజ వాంఛల్నీ, సంస్కారాల్నీ తీర్చి దిద్దగల ఆ రాత్రి కోసం పరితపించిన నా హృదయానికి అదో శుభోదయం అయిపోయింది అయినా ఆ ఉద్రేకం, ఆ ఉల్లాసం నాలో ఎంతోకాలం నిలువలేదు. ఆ ఒకే ఒక్క రాత్రితో నా బ్రతుకుబాట ఛిన్నాభిన్నమైపోయింది శశీ!...ఏమని చెప్పను?... అది నిజంగా శోభనంగాదు నా పాలిటి యమకూపం

జాజి విరజాజుల నెరజిమ్మి చక్కగా అలంకరింపబడిన శోభనపు గదిలో పట్టు పీతాంబరాల పాన్పుపై పవళించిన విశ్వం నా కళ్ళకు మన్మధునిలా అగుపడ్డాడు. ఆ సన్నివేశంలో ప్రతి స్త్రీ హృదయంలోనూ అలాంటి భావనే విలసిత మౌతుం దనడం సత్యవిదూరం గాదు శశీ!

అతణ్ణి చూస్తూ నే నూరకుండలేకపోయాను నా నరాల తపననీ నా రక్తపు ఘోషనీ ఆపలేకపోయాను ఒక్క ఉదుటులో అతని వళ్ళో దూరి అతణ్ణి తీవెలా అల్లుకపోయాను సిగ్గులేక అతని అధరాలపై ముద్దులవర్షం కురిపించానుగూడ

అప్పట్లో అతని అనుభూతు లేవో, అతని ఆలోచన లేవో నే నూహించనే లేదు కేవలం నా నరాల తృష్ణనీ, నా అధరాల ఉలుకునీ పులకింపజేయడమే నా తక్షణ కర్తవ్యం అయ్యింది నా ఆవేశానికతడు చిలిపిగా నవ్వుతూ నన్ను తన కౌగిట్లో ఇరికించుకున్నాడు నా ముంగురుల్ని సర్దుతూ అన్నాడుగదా "చిట్టీ ఒక్కమాట"

అంతటి ఆనందసమయంలో అనవలసిందీ, మాట్లాడవలసిందీ ఒక్క

మాటేనా శశీ! వందలో...వేలో. అయినా నాలో ఎలాంటి భావనా కనబడనీక నవ్వుతోనే "ఇంకా ఒక్కమాటేమిటి విశ్వం?" అన్నాను

విశ్వం నాలోకి అనురాగంగా చూస్తూ "మాటగాదు చిట్టీ! అదొక సమస్య దానికి నీ సమాధానం కావాలి" అన్నాడు.

"సమస్య?...నీవు విడదీయలేని సమస్య ఏముంది విశ్వం? చెప్పు త్వరగా" అంటూ అతని ఒడిలో తల పెట్టి వెల్లకిలా పరున్నాను అతడా సమస్యను చెప్పేంత సేపూ అతని ముఖంలో ఎన్ని భావాలు దొర్లాయో, ఎన్ని రంగులు మారాయో తల్చుకుంటే నా గుండె తరుక్కుపోతోంది శశీ!!

ఇంతకూ అతడు చెప్పిన సమస్య సారాంశం ఏమిటంటే ఒక అందమైన అమ్మాయి ఒక అబ్బాయిని ప్రేమించిందట అంతేగాదు అతణ్ణి మహా వైభవంగా పెళ్ళాడిందటగూడ కాని తీరా పెళ్ళయిన తర్వాత ఆమె ఆశించిన మధురతా ..ఊహించుకొన్న స్వర్గాలూ బూడిదపాలయ్యాయట అందుక్కారణం . అతడు...నపుంసకుడట శశీ!... నపుంసకుడట ఇదంతా చెప్పుకొచ్చిన తర్వాత అతడు "చిట్టీ, ఆమె బ్రతుకులో ఇక ఆరనిచిచ్చు రగిలిపోరలవలసిందేనా? విముక్తి కిక మార్గం లేదా?" అన్నాడు

దానికిక సమాధానం ఏమని చెప్పగలను శశీ! ఆమె అతణ్ణి ప్రేమించి, తనకై తానే పెళ్ళి ప్రయత్నాలు జరిపి, వివాహ మాడినంతమాత్రాన తప్పంతా ఆమెదే నని చెప్పగలమా? ఇక పోతే అతడు ఆమె అనురాగాన్నీ, ప్రణయ పిపాసనూ చూచింతర్వాతనైనా ఆ ఘనుడు తన స్థితినీ, తన ధ్యేయాన్నీ ఆమె ముందు ఏకరువు పెట్టాల్సింది అప్పుడామె తన తప్పిదాన్ని సరిదిద్దుకొనేది కాని అతడలా చేయలేకపోయాడు అందుకే బాగా ఆలోచించి "అతడు పచ్చి మోసగాడు" అన్నాను, విశ్వానికి నా అభిప్రాయాన్ని వివరిస్తూ.

"అదెలా చిట్టీ! అతడు మాట్లాడేందుకు గూడ తగిన అవకాశం ఆమె కల్పించకపోతే అతడేం చేయగలడిక? ఆమె గారడి చేస్తోంటే ప్రేక్షకునిలా చూస్తూ ఊరకుండిపోయాడు" అన్నాడు విశ్వం

అతని మాటలకు నవ్వుకున్నా న్నేను. అతని మాటల్లో నిజంకూడా లేకపోలేదు అందుకే కాసేపు మౌనంగా వుండి. "అయినా విశ్వం! ఇలాంటి మధుర ఘడియల్లో ఏవేవో ఆలోచనల్తో సతమతమవ్వడం మన కెందుకొచ్చిన గోల" అన్నాను అతని పెదాల దగ్గరకు నా పెదాల్ని తీసుకెళ్తూ

"ఇది గోలగాదు చిట్టీ!...గోలగాదు, తీరని సమస్య అందులో ఇది మన సమస్య" అన్నాడు విశ్వం పైన తిరిగే "ఫేన్" వైపు చూస్తూ.

దాంతో నా నెత్తిన పిడుగు పడ్డట్లయింది. కళ్ళు గిర్రున తిరిగాయి. రక్తం చల్లబడిపోయింది. వళ్ళు సళ్ళు బారిపోయింది. చివరకు అతిభారంగా "ఇది నిజమా విశ్వం" అన్నాను.

"చిట్టీ! నీతో అబద్ధం చెప్పాల్సినంత అవసరం నా కెందుకు? అంటూ అతడు కిటికీదగ్గరకు వెళ్ళి కుర్చీలో కూర్చున్నాడు.

నాకు భోరున ఏడ్వా లనిపించింది. అయినా కళ్ళకు నీళ్ళు రాలేదు. ఏదేదో అనా లనుకున్నాను. కాని నోరు పిడచ గట్టుకొని పోయినందున మాటలు దొర్ల లేదు. వెర్రిగా, అర్థరహితంగా అట్లే కూర్చుండిపోయాను. యధాస్థితికి వచ్చి కళ్ళు నులుపుకొని చూద్దునుగదా— గదిలో విశ్వం కనబడలేదు. క్రింద ఎవరో మాట్లాడుకోవడం నాకు వినిపించింది. వాచీ చూచుకున్నాను. అయిదుగంటలు దాటిపోయింది. అంటే తెల్లవార వచ్చిందన్నమాట. కాని శశీ! నన్నుమాత్రం గాఢాంధకారం చుట్టుముట్టేసింది. అప్పట్లో నా పరిస్థితి నీవు వూహించుకోవలసిందే కాని వ్రాయడానికి మాటలు చాలడంలేదు శశీ!!

ఆ తర్వాత అతడు నన్ను అనునయించబోయాడు. కాని నా కదంతా అసహ్యంగా వుండిపోయింది. అయినా శశీ! ఒక్కటి మాత్రం ధైర్యంగా చెప్ప గలను. పురుషుడు తన బలహీనతను బహిర్గత పరచ నిచ్ఛగించ డేనాడూ. అది తన పురుషత్వానికే తీరని మచ్చని అతని భావం. కాని అతని ఆ దౌర్బల్యానికి ఎందరు ఎలా నాశన మైపోతారో ఆలోచించనైనా ఆలోచించడు. తీరా దాని ప్రభావం పరులకు ఉరిపాశమై విలయ తాండవం ఆడినప్పుడు కేవలం ఒక్క సానుభూతితో తప్పించుకో జూస్తాడేగాని తన ఆనందాన్నీ ఆశయాల్నీ ఏ మాత్రం వదులుకోడు. నిజంగా ఇదెంత నీచమో చూడు శశీ!!

ఎంతైనా నేను ఆడదాన్ని. నాలోనూ ఆశలూ, ఆశయా లున్నాయ్! నా నరాల్లో ఇరగని తృష్ణా, ఎముకల్లో తరగని గుంజా వున్నాయ్! ఆలోచించుకొనే శక్తీ, నిర్ణయించుకునే స్థోమతా వుంది. ముందుముందు నా బ్రతుకుబాటలో ఇంకెన్ని మజిలీ లున్నాయో ఇప్పట్లో చెప్పలేను. నాలాంటి పరిస్థితుల్లో పరిభ్రమించే ఏ స్త్రీ అయినా ఎలాంటి నిర్ణయానికి రాగలదో నీవే ఊహించుకో. అది నీకే వదిలేస్తున్నా.

శశీ! నెలరోజులుగా వుత్తరం వ్రాయలే దెందు కన్నావు. అందుకే ఇంత పెద్దవుత్తరం విపులంగా వ్రాస్తున్నాను. నీ అభిప్రాయంగానీ, చివరకు నీ సానుభూతిగానీ కాదు నా క్కావలసింది. మరువకుండా నే నెక్కడున్నా నీ యోగక్షేమాల్ని మాత్రం తెల్పుతూండు.

నీ... చిట్టి.